సిర్పూర్(యు)లో రక్తదాన శిబిరం

సిర్పూర్(యు), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం పోలీసుశాఖ వారి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా జైనూర్‌సీఐ రమేష్ మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల దినోత్సవంలో భాగంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. రక్తదానం చేయడం మారొకరి ప్రాణం కాపాడడానికి తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్సై రామకృష్ణ, మార్కెట్‌కమిటీ మాజీచైర్మన్ ఆత్రం భగవంత్‌రావు, శీతల్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం

● ఎంపీ గోడం నగేష్



పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న ఎంపీ గోడం నగేష్

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 27 (ఆంధ్ర జ్యోతి): ఆదివాసీల అభివృద్ధికోసం కేంద్ర ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని ఎంపీ గోడంనగేష్ అన్నారు. ఆదివారం మండలంలోని మోవాడలో నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుమరంభీం విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాజీఎంపీటీసీ లింగు, మాజీసర్పంచ్ కౌసల్య పార్టీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆదివాసీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సంక్షేమపథకాలతో ముందుకు పోతుందన్నారు. జన్‌మన్ పథకం ద్వారా ఆదివాసీల వెనుకబడిన వర్గాలైన పీవీటీజీల మౌలిక వసతులైన విద్య, వైద్యం, అభివృద్ధి కోసం అవసరమైన చర్యలు తీసుకుంటుందన్నారు. అవినీతి రహిత దేశంకోసం బీజేపీ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున్, విజయ్, సొల్లు లక్ష్మి, మంగ పెంటయ్య, ప్రసాద్‌గౌడ్, ప్రహ్లాద్, శ్రీకాంత్, సంతోష్, సత్తన్న, పెంటన్న, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

కూరగాయాలు

- ధరలతో సామాన్యుడు విలవిల
- సిండికేటు వ్యాపారంతో ధరలకు రెక్కలు
- రూ.100 పెట్టనిదే రాని కూరగాయలు



కూరగాయలు	ధర (కిలో)	వారం క్రితం ధరలు (కిలో)
టమాటా	80	100
వంకాయ	60	80
బెండకాయ	40	80
చిక్కుడు	80	200
పచ్చిమిర్చి	100	120
అలిచెంత	80	100
బీరకాయ	80	80
క్యాబేజి	100	120
పూల్ గోబి	100	120
ఉల్లిగడ్డ	50	80
ఆలుగడ్డ	40	50

కాగజ్‌నగర్ టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మార్కెట్‌లో కూరగాయల ధరలు ఆకాశానంటుతు న్నాయి. కొన్ని రోజులుగా ధరలు తగ్గకుండా వ్యాపారులు సిండికేటుగా మారి వ్యాపారులు అంతా ధరలు పెంచి సామాన్యుడి నడ్డి విరుస్తున్నారనే ఆరోపణలున్నాయి. భారీవర్షాలకు, మండు వేసవిలో, పండు గల సీజన్‌లో ఎప్పుడైనా కాగజ్ నగర్‌లో మాత్రం రూ.100 పెట్టనిదే కూరగాయలు రాని పరిస్థితి. ధరలు అమాంతం పెరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు మాత్రం ధరలు అదుపు చేసేంత తీరిక లేకుండా ఉన్నారు.

జూన్‌లోనే ధరలు ఆకాశాన్నంటాయి. అప్పటి నుంచి ధరలు దిగి రావడం లేదు. పెరిగిన ధరలతో ప్రజలు బెంబే లెత్తుతున్నారు. కూరగాయల డిమాండ్ పెరుగుతుండడం.. మరో వైపు దిగుమ తులు సరిగా లేక ధరలు అమాంతం పెంచేస్తు న్నారు. కాగజ్ నగర్‌కు సమీపంలో ఉన్న కోల్‌బెల్ట్ ఏరియాలో మాత్ర కూరగా యల ధరలు తక్కువగానే ఉన్నాయని వినియోగదారులు పేర్కొం టున్నారు. బెల్లంపల్లి, మంచిర్యాల, మందమర్రి, గోదావరిఖని, రెబ్బెన, తాండూరు తదితర ప్రాంతాల్లో కూరగాయల ధరలు సామాన్యులకు అందుబాటులో ఉన్నాయంటున్నారు. అయితే కోల్‌బెల్ట్ ఏరియాతో పోలిస్తే స్థానికంగా తక్కువగా ఉండాల్సి ఉన్నా హోల్‌సేల్ వ్యాపారుల దెబ్బకు ధరలు ఆకాశానంటు న్నాయని ఆరోపణలు న్నాయి. దళారులు సిండికేట్ చేస్తుండడంతో ధరలు చుక్కలనంటున్నాయని వినియోగదారులు ఆరోపిస్తున్నారు.

● దిగుమతి లేకపోవడంతో..

ఇతర రాష్ట్రాల నుంచి కూరగాయలు, ఉల్లి, ఆలుగడ్డలు ఇతర కూరగాయలు దిగుమతి లేకపోవడంతోనే ధరలు పెరుగుతు న్నాయని వ్యాపారులు పేర్కొంటు న్నారు. అయితే భారీవర్షాలకు కూరగాయలు ధరలు పెరిగినా, ప్రస్తుతం వర్షాలు తగ్గు ముఖం పట్టినా కూడా ధరలకు అదే విధంగా కొనసాగించడం చూస్తే వ్యాపారుల మిలాఖత్ అర్థం అవుతోంది. స్థానికంగా పండించే కూరగాయలను వేరే ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే కూరగాయల ధరలు అధికంగా ఉంటు న్నాయి. ఏదేమైనా సామాన్యుడికి అందుబాటులోకి తెచ్చేవిధంగా కూరగాయల ధరలు నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

ఛత్తీస్‌గఢ్ వైపు ఏనుగు

పెంచికలపేట, అక్టోబరు 27(ఆంధ్ర జ్యోతి): మూడురోజులుగా తెలంగాణ-మహారాష్ట్రసరిహద్దు గడ్చిరోలి అటవీ ప్రాంతంలో ఏనుగుసంచారం అటు అటవీఅధికారులకు, ఇటు అటవీప్రాంత గ్రామాల ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేసింది. అయితే ఏనుగు తెలంగాణ మహారాష్ట్ర సరిహద్దును వదిలి ఛత్తీస్‌గఢ్ వైపు పయన మైంది. ఏనుగు జిల్లాకు 30కిలోమీటర్ల దూరంలో సంచరించిన విషయం తెలిసిందే. ఇప్పుడు సుమారు 130కిలోమీటర్ల దూరానికి వెళ్లినట్లు అటవీఅధికారులు ధ్రువీకరించారు. ఈవిషయమై ఎఫ్‌ఆర్వో విజయ్ కుమార్‌ను సంప్రదించగా ఏనుగు ఛత్తీస్‌గఢ్ వైపు వెళ్తోందని తెలిపారు. అయినా తామంతా సిబ్బందితో అప్రమత్తంగా ఉన్నట్లు తెలిపారు.

ఎన్‌హెచ్‌ఎంల కమిటీ

ఆసిఫాబాద్, అక్టోబరు 27(ఆంధ్ర జ్యోతి): ఎన్‌హెచ్‌ఎంలోని ఎంఎల్‌హెచ్‌పీల నూతనకార్యవర్గంను ఆదివారం ఏఐటీయూసీ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు దివాకర్, ఉపేందర్ సమక్షంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గణేష్, ఉపాధ్యక్షుడిగా కీర్తన, ప్రశంత్, విజయ్ సాగర్, ప్రధానకార్యదర్శిగా సారిక, సహాయకార్యదర్శిగా రాందాస్, ప్రకాష్, కోశాధికారిగా శ్రేష్మను ఎన్నుకున్నట్లు తెలిపారు.

80 క్వింటాళ్ల వడ్లు పట్టివేత

చింతలమానేపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడెం చెక్‌పోస్టు వద్ద మహారాష్ట్రకు తరలిస్తున్న 80క్వింటాళ్ల వడ్లను పట్టుకున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకపోవ డంతో వడ్లను పట్టుకుని సివిల్ సప్లయి అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

కలప పట్టివేత

బెజ్జూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్జవెల్లి అటవీరేంజ్ పరిధిలోని ముంజంపల్లి గ్రామంలో ఆదివారం కర్జవెల్లి ఇన్‌చార్జి అధికారి ఎక్బాల్ ఆధ్వర్యంలో పలువురి ఇళ్లలో, పంటచేనులలో దాడులు నిర్వహించి రూ.1.50లక్షల కలపపట్టుకున్నట్లు తెలిపారు. పలువురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జాతర పోస్టర్ల విడుదల

కౌటాల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కంకాలమ్మ ఆలయ ప్రాంగణంలో డిసెంబరు1,2తేదీల్లో నిర్వహించే కంకాలమ్మ జాతరపోస్టర్లను ఆలయకమిటీ చైర్మన్ సుల్వకనకయ్య ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. అనంతరం ఆలయకమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సుల్వ కనకయ్య, గౌరవఅధ్యక్షుడిగా విశ్వనాథ్, కన్వీనర్‌గా రామయ్య, ఉపాధ్యక్షుడిగా సత్తయ్య, ప్రధానకార్యదర్శిగా రాములు, కోశాధికారిగా లహను, ప్రచార కార్యదర్శిగా శ్రీనివాస్, సభ్యులను ఎన్నుకున్నారు.

ఆదివాసీ గూడాల్లో మొదలైన దండారి సంబరాలు



కెరమెరిలో దండారి ఉత్సవాలు నిర్వహిస్తున్న గిరిజనులు

కెరమెరి, అక్టోబరు 27: మండలంలోని గోండు, కోలాంగూడలలో దండారి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రతియేటా దీపావళి పండుగ పర్వదినానికి వారం రోజుల ముందు భోగిపండుగతో గోండు, కోలాంగూడలలో వారంరోజులపాటు గిరిజనులు దండారి ఉత్సవాలు నిర్వహిస్తారు. గిరిజనులు అత్యంత పవిత్రంగా భావించే ఈ ఉత్సవాలు శనివారం సాయంత్రం నుంచి ప్రారంభమయ్యాయి. భీమన్‌గొంది, కోలాంగూడలోని ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. కాగా జన్నారం మండలం ఇస్లాంపూర్ గ్రామానికి చెందిన దండారి భీమన్‌గొంది గ్రామానికి వచ్చింది. సమీప గ్రామాలైన గోయగాం సావర్‌ఖేడ, ధనోరతోపాటు పలుగ్రామాల ప్రజలు దండారి ఉత్సవాలను తిలంకిచేందుకు వచ్చారు. భీమన్ గొంది గ్రామస్థులు, పటేల్ భీం, రాము, పాండురంగ్, దేవు, రాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులు రాష్ట్రస్థాయికి ఎదగాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మాజీ జడ్పీటీసీ అజయ్‌కుమార్

వాంకిడి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు జిల్లా,రాష్ట్ర స్థాయికి ఎదగాలని మాజీజడ్పీటీసీ అజయ్‌కుమార్ కోరారు. మండల కేంద్రంలో డైలీ క్రికెట్‌యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డబ్ల్యూపీఎల్ సీజన్-2 క్రికెట్‌పోటీ లను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యానికి దోహదపడతాయన్నారు. క్రీడల్లో గెలుపుఓటములు సహజమన్నారు. క్రీడలు నిర్వహించడంవల్ల క్రీడాకారుల్లో స్నేహ సంబంధాలు పెరుగుతాయన్నారు.క్రీడాకారులను ప్రోత్సహించడానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో వాంకిడి, బంబార, మాజీసర్పంచులు బండెతుకారాం, సయ్యద్ అయ్యూబ్, కోట్నకశంకర్, వివిధ గ్రామాలకుచెందిన క్రీడాకారులు, డైలీక్రికెట్ యూత్‌సభ్యులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి

ఆసిఫాబాద్ రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జీవో నెం.317 బాధితులందరికి న్యాయంచేయాలని టీఎస్‌యూటీఎఫ్ నాయకుల డిమాం డ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆసంఘం జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వెంటనే డీఏను విడుదల చేయాలని కోరారు. అలాగే ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు హేమంత్, రమేష్, అనీత, హరీష్, సుభాష్, సుశీల్, రవి, దీపిక, కాలేరాం తదితరులు పాల్గొన్నారు.

భీం స్మారక జెండాపూజ పోస్టర్ల ఆవిష్కరణ



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఈనెల30న జిల్లాకేంద్రంలోని కుమరంభీం చౌరస్తాలో భీంవిగ్రహం వద్ద నిర్వహించే స్మారక జెండా పూజాపోస్టర్లను ఆదివారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి నిర్వహణకమిటీ సభ్యులతోకలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ భీం స్మారకజెండా పూజను ఘనంగా నిర్వహించాలని, పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలోనాయకులు రాజు, శ్రీనివాస్, గణేష్, వెంకటేష్,రాము, అంబరావు తదితరులు పాల్గొన్నారు.



ఒక్క చోట చేరిన పూర్వ విద్యార్థులు

పూర్వవిద్యార్థుల సమ్మేళనం

కౌటాల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయనగరం గ్రామంలోని సెయింట్‌జోసెఫ్ ఉన్నతపాఠశాలలో చదివిన 2006-07 బ్యాచ్‌కు చెందిన పదవతరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా అప్పటి గురువులను సన్మానించారు. అలాగే తోటిస్నేహితులను కలుసుకుని అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అలీస్, మారయ్య, ఇందిరదేవి, దిలీప్, సీతారాం, శ్రీనివాస్, వెరోనికలతో పాటు ప్రిన్సిపాల్ ఫాదర్‌టోంలు పాల్గొన్నారు.

గల్లంతైన వారిలో ఇద్దరి మృతదేహాలు లభ్యం



మృతదేహాలను బయటకు తీసుకువస్తున్న గజ ఈతగాళ్లు

బెజ్జూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోసిని సమీపంలోని ప్రాణహితలో శనివారం స్నానానికి వెళ్లి ముగ్గురు యువకులు గల్లంతుకాగా ఆదివారం జాహీర్‌హుస్సేన్, ఇర్షాద్ మృతదేహాలు లభ్యం అయ్యాయి. మరోయువకుడు మోహిజ్ మృతదేహం లభ్యం కాలేదు. బెజ్జూరుకు చెందిన జాహీద్‌హుస్సేన్, ఇర్షాద్, మోహిజ్ సోమిని సమీపంలోని ప్రాణహిత ఎర్రబండరేవు వద్ద స్నానానికి వెళ్లి గల్లంతు కాగా ఇద్దరి మృతదేహాలు ప్రాణహితలో మూడు కిలోమీటర్ల దూరంలో తలాయి వద్ద లభ్యం అయ్యాయి. ఆదివారం డీఎస్పీ రామానుజన్, సీఐ రమేష్, ఎస్సై విక్రం గజ ఈతగాళ్లతో గాలించారు. మరో మృతదేహం కోసం లభించలేదు. చీకటిపడడంతో గాలింపు ఆపేశారు. సంఘటన స్థలాన్ని ఎమ్మెల్సీ దండె విఠల్ తదితరులు పరిశీలించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని అన్నారు. బాధిత కుటుంబాలను ఆదివారం మాజీ జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు పరామర్శించారు. ఆయన వెంట నాయకులు సిద్ధిఖీ, బషరత్, వెంకన్న, సకారాం, సతీష్ తదితరులు ఉన్నారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడి మృతి



సుశీల్(ఫైల్)

సిర్పూర్(యు), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా(హెచ్‌బీటీ) పనిచేస్తున్న వడ్లూర్ సుశీల్(30) ఆదివారంఅనారోగ్యంతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సుశీల్ వారంరోజుల క్రితం అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో అతనికి ఆదిలాబాద్‌లో చికిత్స చేయించారు. తగ్గకపోవడంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. అయినప్పటికీ ఆరోగ్యం క్షీణించి ఆదివారం ఉదయం నిమ్స్ ఆస్పత్రిలో మృతిచెందాడు.

కుమరం భీం వర్ధంతి

కౌటాల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీర్దండి గ్రామంలో ఆదివారం కుమరంభీం వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండె విఠల్, డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ మాంతయ్య, నాయకులు విశ్వనాథ్, రేణుక, బండు, పోచాని, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మాంతయ్య

క్రైం కార్నర్

అనారోగ్యంతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య



సంపత్ (ఫైల్)

శ్రీరాంపూర్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో ఆటో డ్రైవర్ సంపత్ (45) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. క్రిష్ణకాలనీలో నివసిస్తున్న సంపత్ టిఫిన్ చేసేందుకని ఈ నెల 23న ఉదయం ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. అప్పటి నుంచి ఇంటికి తిరిగి రాలేదు. ఆది వారం ఆర్కే 6 గని వెనక ఉన్న అటవీ ప్రాంతంలో ఓ వ్యక్తి చెట్టుకు ఉరివేసుకొని చనిపోయినట్లు సమాచారం అందడంతో పోలీసులు అక్కడి వెళ్లి పరిశీలించారు. సంపత్ ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎస్‌ఐ సంతోష్ తెలిపారు.

గెస్ట్‌హౌస్ సీజ్



సీజ్ చేస్తున్న రెవెన్యూ, పోలీస్ అధికారులు

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఎల్ఐసీ కార్యాలయం సమీపంలో గల గెస్ట్ హౌస్‌ను ఆదివారం రెవెన్యూ, పోలీస్ అధికారులు సీజ్ చేశారు. గతంలో ఈ గెస్ట్ హౌస్‌లో వ్యభిచారం నిర్వహిస్తుండగా నిర్వాహకులను, విటులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసులు నమోదైనప్పటికీ వ్యభిచారం నడుస్తున్నందున శాంతిభద్రతలకు విఘాతం కల్గుతుందని, గెస్ట్‌హౌస్‌ను సీజ్ చేయాలని ఆర్డీవోను పోలీసులు కోరగా ఉత్తర్వులు జారీ చేశారు. తహసీల్దార్ రఫ్తతుల్లా హుస్సేన్, పట్టణ సీఐ ప్రమోద్‌రావు, ఎస్సై ప్రవీణ్‌కుమార్, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

కరకట్టల నిర్మాణానికి నిధులు మంజూరు



క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

హాజీపూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాలలో రాళ్లవాగుకు ఇరువైపులా రూ.255 కోట్లతో కరకట్టలు నిర్మించేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపినందుకు కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం హాజీపూర్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. నాయకులు మాట్లాడుతూ కరకట్టల నిర్మాణానికి ఎమ్మెల్యే ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పాల్గొన్న పూర్వ విద్యార్థులు

రామకృష్ణాపూర్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చైతన్య పాఠశాలలో 2001-2002 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు 22 సంవత్సరాల తర్వాత ఒకటయ్యారు. ఆదివారం ఆర్కే ఓసీ క్లబ్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఆనందంగా గడిపారు. విద్యా బుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. మృతి చెందిన గురువులకు నివాళులర్పించి మౌనం పాటించారు. పూర్వ ఉపాధ్యాయులు హెడ్‌మాస్టర్ అర్జయ్య, కుమార్, సురేందర్, ఒడ్నాల శ్రీనివాస్, పద్మజ, నయోమి, శంకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు నైపుణ్యం పెంపు దృష్టి



సెమినార్‌లో మాట్లాడుతున్న అథ్లెటిక్స్ అధ్యక్షుడు సాంబమూర్తి

నస్పూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అథ్లెటిక్స్ క్రీడాకారుల్లో నైపుణ్యం పెంపొందించేందుకు ప్రత్యేక శిక్షణ నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు సాంబమూర్తి, ఈగ మారయ్యలు అన్నారు. నస్పూర్‌లో ఆదివారం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూల్స్ అండ్ రెగ్యులేషన్స్, మాడిఫికేషన్స్ రూల్స్‌పై సెమినార్ నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు మాట్లాడుతూ క్రీడాకారులకు మెరుగైన శిక్షణకు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస రాజు, పెంచాల శ్రీధర్, జిల్లాలోని 80 మంది పీఈటీలు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

జోనల్ స్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో కోచ్‌లు

నస్పూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల స్కూల్ గేమ్స్ జిల్లా స్థాయి వూషూ అండర్-17, అండర్-19 బల బాలికల ఎంపిక పోటీలు ఆదివారం నస్పూర్‌లో జరిగాయి. బాల బాలికల విభాగంలో వూషూ అండర్-17 జోనల్ స్థాయి లో ఎంపికైన వారిలో సాయి ప్రసన్న, హర్షిత, మన్విత, వైశాలి, యోగిత, కార్తికేయ, వంశీ, శ్రీ కృష్ణ, శ్రీనిత్, చరణ్, సర్ధన్ తేజ్‌లు ఉన్నారు. వూషూ అండర్-19లో హాసిని, రుషికేష్, అంజిలు ఉన్నరని కరస్పాండెంట్ గోపతి సత్తయ్య, కోచ్ ఆర్గనైజర్లు శివ మహేష్, వెంకటేష్‌లు తెలిపారు.

లక్ష్యం..నిర్లక్ష్యం..!



నిరుపయోగంగా ఉన్న కంపోస్టుషెడ్డు

- నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు
- నిర్మించి వదిలేశారు..
- పట్టించుకోని అధికారులు

వాంకిడి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పల్లెలను పరిశుభ్రంగా మార్చడంతోపాటు చెత్తనుంచి సంపద తయారీకి ప్రభుత్వం ఉపాధిహామీ పథకం ద్వారా సెగ్రిగేషన్ షెడ్లను నిర్మించింది. అయితే ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సెగ్రిగేషన్(కంపోస్టు) షెడ్లు నిరుపయోగంగా మారాయి. కొన్ని మండలాల్లో గతేడాది వచ్చిన వరదలకు సెగ్రిగేషన్ షెడ్లు కొట్టుకు పోయాయి. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన షెడ్లు నిర్వహణలేక అస్తవ్యస్తంగా మారాయి. జిల్లాలోని 15మండలాల్లోని గ్రామ పంచాయ తీల్లో డంపింగ్ యార్డులకు అనుసంధానంగా కంపోస్టు షెడ్లు నిర్మించారు. ఒక్కో కంపోస్టు షెడ్డుకు రూ. 2.50లక్షలు వెచ్చించారు. గ్రామపంచాయతీ పరిధిలో ప్రతీఇంటి నుంచి ట్రాక్టర్ల ద్వారా సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుల వద్ద తడి, పొడిచెత్తలను రెండుగా వేరు చేయాల్సి ఉండగా ఆచరణలో అమలు కావడంలేదు. ప్లాస్టిక్, అట్టలు, సీసాలు వంటివి వేరు చేయడంలేదు. సేంద్రియ ఎరువు తయారీ నామమాత్రంగా కొనసాగుతోంది.

తడి పొడి చెత్త వేర్వేరుగా సేకరణపై కొరవడిన అవగాహన..

తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడంలో నిర్వహణ కొరవడింది. పారిశుధ్య కార్మికులు ఇంటింటా చెత్త సేకరిస్తున్న సమయంలో యజమానులు తడి, పొడి చెత్తను ఒకేదాంట్లో వేసి ఇస్తున్నారు. షెడ్లవద్ద వేరు చేసేందుకు పంచాయతీల్లో సిబ్బంది కొరత ఇబ్బందిగా మారింది. ఉన్న కార్మికులు మురుగు కాలువలను శుభ్రం చేయడం, ఇతర పనులకు ప్రాధాన్యం ఇస్తు న్నారు. రోజు చెత్తను వేరుచేసి ఎరువు తయారు చేయా లంటే 45 రోజులు పడుతుంది. అది కూడా వానపాములు కొనుగోలు చేసినప్పుడే సాధ్యమవుతుంది. కొన్నిచోట్ల ఎరువు తయారీపై దృష్టిసారించకపోగా మరికొన్ని పంచాయతీల్లో కొంతఎరువుపోసి నెలల తరబడి ఉంచుతున్నారు. కొన్నిమండలాల్లో వీటిని ఏమాత్రం ఉపయో గించడం లేదు. ఉన్నతాధికారులు పర్యటించే సమదర్భాల్లో పరిశీలించే అవకాశాలు ఉన్నందున తయారైన ఎరువును తీసుకువచ్చి షెడ్డువద్ద ఉంచుతున్నారు. కొన్నిచోట్ల ఎరువు తయారీని అదనపు భారంగా భావించి చెత్తను డంపింగ్ యార్డులోనే కాల్చేస్తున్నారు.

జిల్లాల్లో ఇదీ పరిస్థితి..

జిల్లాలోని 15మండలాల్లో 331 కంపోస్టు షెడ్లు నిర్మించారు. ఇందుకుగాను ఒక్కోదానికి రూ.2.50 లక్షలు వెచ్చించారు. జిల్లావ్యాప్తంగా కంపోస్టు షెడ్ల నిర్మాణాలకు రూ.8.63కోట్లు నిధులు ఖర్చు చేశారు. జిల్లా వ్యాప్తంగా నిర్మించిన కంపోస్టు షెడ్లు ప్రస్తుతం నిరుపయోగంగా ఉండడంతో వీటి నిర్మాణాలకు వెచ్చించిన నిధులు వృధా కాగా నిర్మించిన షెడ్లు నిరుపయోగంగా పిచ్చిమొక్కలతో దర్శణమిస్తున్నాయి. లక్షల రూపాయలతో నిర్మించిన షెడ్లను ఉపయోగంలోకి తీసుకురావడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. అధికారులు కంపోస్టు షెడ్లను ఉపయోగంలోకి తీసుకువచ్చి సేంద్రియ ఎరువులు తయారు చేసి పంచాయతీలకు ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

చేయాల్సింది ఇలా..

- ప్రతిరోజు ఇంటింటికి తిరిగి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి
- సేకరించిన చెత్తను సెగ్రిగేషన్ షెడ్లలోని బ్లాకుల్లో వేరు చేయాలి.
- రోజుల తరబడి చెరత్తను అందులో మగ్గించినట్లయితే అది ఎరువుగా మారుతుంది.
- ఇలా మారిన ఎరువును రైతులకు విక్రయించి ఆదాయం పొందాలి.
- అధికారులు ఇలా చేస్తే ప్రభుత్వ ఆశయం నేరవేరడంతో పాటు పంచాయతీకి ఆదాయం వస్తుంది.
- కాని క్షేత్రస్థాయిలో ఈ విధానం అమలు జరగకపోవడంతో గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త దర్శనమిస్తోంది.

కంపోస్టు షెడ్ల నిర్వహణ పంచాయతీలదే



కంపోస్టు షెడ్లను ఉపాధిహామీ పథకం ద్వారా నిర్మిం చాం. ఒక్కో కంపోస్టు షెడ్డుకు రూ.2.50లక్షలు వెచ్చించాం. వాటి నిర్వహణ బాధ్యత పంచాయతీల పై ఉంది. పంచాయతీల్లో సిబ్బంది కొరత తదితర కారణాలతో షెడ్ల నిర్వహణ కొసాగడంలేదు.

- ఈజీఎస్ ఏపీవో శ్రావణ్

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఈనెల28 నుంచి 30వరకు మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ బాలబాలికల ఖోఖోపోటీల్లో ఆసిఫాబాద్ గిరిజన ఆదర్శ క్రీడాపాఠశాలకు చెందిన విద్యార్థినులు నందిని, సోని, అక్షిత, జంగు, సత్యశీల, నాగేశ్వరి, సరోజ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు జంగు, స్పోర్ట్స్ అధికారి మీనారెడ్డి తెలిపారు. విద్యార్థినులను డీడీ రమాదేవి ఏసీఎంవో ఉద్దవ్, జీసీడీవో శకుంతల, కోచ్‌లు అరవింద్, విద్యాసాగర్, హెచ్‌డబ్ల్యూవో సాయిబాబా అభినందించారు.

రెబ్బెనలో పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రెబ్బెన, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం ఇందిరానగర్‌లో వెలసిన శ్రీకనక దుర్గాదేవి మహంకాళి ఆలయంలో ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఒడి బియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. తాండూరు సీఐ కుమారస్వామి దంపతులు పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్చకులు దేవర వినోద్ భక్తులు తీర్థప్రసాదాలను అందజేశారు.

ఘనంగా గంగాదేవి ప్రతిమ నిమజ్జనం



గంగాదేవి ప్రతిమను ఊరేగిస్తున్న భక్తులు

బెజ్జూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో మత్స్యకారులు ప్రతిష్ఠించిన గంగాదేవి ప్రతిమను ఆదివారం నిమ్మనం చేశారు. అయిదురోజులపాటు మత్స్యకారులు ప్రత్యేకపూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రధానవీధుల గుండా గంగామాత ప్రతిమతో శోభాయాత్ర నిర్వహించారు. ఎమ్మెల్సీ దండె విఠల్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు హర్షద్ హుస్సేన్, ఓంప్రకాష్, నానయ్య, శ్రీవర్ధన్, నహీర్‌అలీ, రాజన్న, సురేష్‌గౌడ్, బాలయ్య, బిచ్చయ్య, పోచయ్య, ఇస్తారి, సతీష్ పాల్గొన్నారు.

ఎస్పీఎంలో లోడింగ్ పాయింట్లను పెంచాలి

- వెంటనే జేకే యాజమాన్యం సమస్యను పరిష్కరించాలి
- లారీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మంచిరెడ్డి రాజేందర్



సమావేశంలో కాగజ్‌నగర్ లారీ అసోసియేషన్ సభ్యులు

కాగజ్‌నగర్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఎస్పీఎంలో లోడింగ్ పాయింట్లను పెంచాలని లారీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మంచిరెడ్డి రాజేందర్ డిమాండ్ చేశారు. ఈ సమస్యను జేకే యాజమాన్యం వెంటనే పరిష్కరించేలా చూడాలన్నారు. కాగజ్‌నగర్‌లో కొన్నిరోజులుగా లారీ అసోసియేషన్‌సభ్యులు చేస్తున్న సమ్మెకు మద్దతు పలికి అనంతరం ఆయన మాట్లాడారు. లారీ అసోసియేషన్ సభ్యుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేందుకు ఎస్పీఎం యాజమాన్యం సహకరించాలన్నారు.

అదేవిధంగా పెరిగిన డీజిల్ ధరలకు అనుగుణంగా కిరాయి ధరలను పెంచాలన్నారు. త్వరలోనే మిల్లు గేటు ఎదుట ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతామన్నారు. రాష్ట్ర వ్యాప్త బంద్ చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో రాష్ట్రకార్యదర్శి చాంద్ పాషా, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అక్బర్, కార్యదర్శి రమేష్, మంచిర్యాల మాజీకార్యదర్శి రఫీక్, కాగజ్ నగర్ లారీ అసోసియేషన్ అధ్యక్షుడు కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



నర్సమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

గర్మిళ్ల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తల్లి ఇటీవల మృతిచెందగా ఆదివారం మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు కరీంనగర్‌లోని ఆయన నివాసానికి వెళ్లి కలిశారు. ఆయన తల్లి నర్సమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆర్థిక సహాయాలు అందజేత



రూ. 20 వేల చెక్కును అందజేస్తున్న ఆత్మీయ చారిటబుల్ ట్రస్టు సభ్యులు

గర్మిళ్ల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రామకృష్ణాపూర్ ప్రాంతానికి చెందిన చేతి శ్యామ్-శైలజ దంపతుల కుమారుడు దుర్గ వరుణ్ వారం రోజుల క్రితం వేడిగా ఉన్న సాంబరు పాత్రలో పడి మంచిర్యాలలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఆత్మీయ చారిటబుల్ ట్రస్టు సభ్యులు ఆదివారం వైద్య ఖర్చుల కోసం శ్యామ్‌కు రూ.20వేల ఆర్థికసహాయాన్ని అందజేశారు. ట్రస్టుఅధ్యక్షుడు సట్ల మహేందర్ మాట్లాడుతూ బాలుడి పరిస్థితి ఇబ్బందిగా ఉందని, వైద్య ఖర్చులకు రోజు సుమారు రూ.20 వేల నుంచి రూ.40 వేల వరకు ఖర్చవుతున్నాయని తెలుసుకుని సహాయం చేశామన్నారు. సభ్యులు జెట్టి శ్రీనివాస్, బండారి భూమేష్, సంపత్, మోటం తిరుపతి, బొక్కల తిరుపతి, ఈ. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లిలో స్నేహితురాలికి..

దండేపల్లి: దండేపల్లికి చెందిన వేముల సుమలత పదో తరగతి స్నేహితురాలు అనారోగ్యంతో ఇబ్బంది పడుతుంది.వారిది పేదకుటుంబం కావడంతో విషయం తెలుసుకున్న బాల్యమిత్రులు ఆదివారం రూ.21,116 ఆర్థిక సాయం అందజేశారు. దండేపల్లి ప్రభుత్వఉన్నత పాఠశాలలో 1998-99లో పదోతరగతి వరకు చదువుకున్నారు. వైద్య ఖర్చులకోసం డబ్బులు జమచేసి చేయూతనిచ్చారు.



దండేపల్లిలో స్నేహితురాలికి ఆర్థిక సాయం అందజేస్తున్న బాల్యమిత్రులు

తాండూరులో విద్యార్థులకు

తాండూర్: మండలానికి చెందిన అండర్ 17 జిల్లా జట్టుకు ఎంపికైనవిద్యార్థులకు ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి క్రీడా దుస్తుల కోసం రూ.5000వ్యాయామఉపాధ్యాయుడు సాంబమూర్తికి అందజేశారు. విద్యార్థులు క్రీడల్లో రాణించి మండలానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. మాజీజెడ్పీటీసీ బండిపోచం, నాయకులు పాల్గొన్నారు.



సంస్థ అభివృద్ధికి సహకరించాలి

- హైదరాబాద్‌లో ముగిసిన పారిశ్రామిక సంబంధాల సదస్సు



సీఎండీ చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకుంటున్న ఐఎన్టీయూసీ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య

మందమర్రి టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇంజనీరింగ్ స్టాఫ్‌కాలేజీలో నాలుగు రోజులుగా యాజమాన్యం నిర్వహించిన పారిశ్రామిక సంబంధాల సదస్సు ముగిసింది. ఈ సదస్సులో పాల్గొన్న కార్మికసంఘాల ప్రతినిధులకు సింగరేణి సీఎండీ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సీఎండీ బలరాం మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సంస్థలో సాంకేతికతతోపాటు ఉత్పత్తి, రక్షణకు సంబంధించి ప్రణాళికబద్ధంగా చర్యలు చేపట్టాలన్నారు. దీనికి కార్మిక సంఘాల ప్రతినిధుల సహకారం అవసరమని తెలిపారు. సంస్థ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్న కార్మికుల ప్రగతికి సంబంధించి రక్షణకు మరింత పెద్దపీట వేస్తామన్నారు. సదస్సులో ఐఎన్టీయూసీ సెక్రెటరీజనరల్ జనక్‌ప్రసాద్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య పాల్గొన్నారు. పాల్గొన్న వారందరికి సీఎండీ సర్టిఫికెట్లను అందజేశారు.

విజిలెన్స్ పెండింగ్ కేసులు పరిష్కరించండి

శ్రీరాంపూర్: మారుపేర్లతో ఉన్న విజిలెన్స్ పెండింగ్‌కేసులు పరిష్కరించాలని సింగరేణిపేర్ల విజిలెన్స్‌పెండింగ్ కేసుల బాధితులు కోరారు. రామగిరి గెస్ట్‌హౌస్‌కు వచ్చిన ఆయనను కలిసి తమసమస్యలు విన్నవించారు. 15ఏళ్లుగా తమ సమస్య పరిష్కారం కావడం లేదని, ఉద్యోగాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ తండ్రులు ఎన్నో ఏళ్ల సింగరేణిలో పనిచేశారని, వారికి రెండు పేర్లు ఉన్నాయనే కారణంతో తమకు కారుణ్య నియామకాలు ఇవ్వడం లేదని తెలిపారు. తాము ఆర్థికఇబ్బందులతో చాలా కష్టాలు పడుతున్నామని అన్నారు. మారు పేర్ల సమస్యను పరిష్కరించి విజిలెన్స్ పెండింగ్ కేసుల బాధితులకు ఉద్యోగ అవకాశం కల్పిస్తామని యాజమాన్యం హామీ ఇచ్చిందని పేర్కొన్నారు. తమ ఇబ్బందులకు పరిగణలోకి ఉద్యోగాలు కల్పించి న్యాయం చేయాలని కోరారు.

కార్మిక నాయకుడిగా గుర్తింపు పొందిన మురళీధర్‌రావు

కాసిపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన కల్వకుంట్ల మురళీధర్‌రావు కార్మిక నాయకుడిగా గుర్తింపు పొందారని మాజీ జెడ్పీటీసీలు శరత్‌చందర్‌రావు, రౌతు సత్తయ్యలు అన్నారు. ముత్యంపల్లికి చెందిన కల్వకుంట్ల మురళీధర్‌రావు సంతాప కార్యక్రమానికి హాజరై ఆయన చిత్రపటానికిపూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ఓరియంట్ కంపెనీలో గుర్తింపు సంఘం నాయకుడిగా కార్మికుల హక్కుల కోసం ఎన్నో పోరా టాలు చేశారన్నారు. మాజీ వైస్ ఎంపీపీ విక్రమ్‌రావు, జగన్‌మోహన్‌రావు, మదన్ మోహన్‌రావు, వంశీకృష్ణ రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ పల్లె చంద్రయ్య, పాల్గొన్నారు.

మిగిలింది పది రోజులే..!

3వపేజీ తరువాయి..

దరఖాస్తు సమర్పించాలి. దీంతో ఆశావహులు, ఆయా పార్టీల ఇన్ చార్జీలు స్వయంగా రంగంలోకి దిగి ఓటరు నమోదు శాతాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నారు. పట్టభద్రుల విద్యార్హతల సర్టిఫికేట్లు, ఆధార్‌కార్డు, ఓటర్ ఐడీ, తదితర వివరాలను సేకరించి ఓటరు నమోదు ప్రక్రియను పూర్తి చేస్తున్నారు.

ఓటరు నమోదు ఇలా....

ఓటరు నమోదు చేసుకునేందుకు 2021 అక్టోబరు 31 వరకు డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులు. వారు ఫారం -18ను పూర్తి చేయడం ద్వారా ఓటరు నమోదు చేసుకోవలసి ఉంటుంది. ఉపాధ్యాయులు, అధ్యాపకులైతే 2018 నవంబరు వరకు మూడేళ్లకు తగ్గకుండా పని చేసి ఉండాలి. వీరు ఫారం-19ను పూర్తి చేయాలి. అలాగే మొబైల్ ఫోన్‌లోనూ ఓటరు నమోదు చేసుకునే వెసలుబాటును ఎన్నికల కమిషన్ కల్పించింది. ఇందు కోసం www.ceotelangana.nic.in వెబ్‌సైట్‌ను ప్రవేశపెట్టింది. సంబంధిత ఫారాన్ని పూర్తిచేసి గెజిటెడ్ అధికారి ధ్రువీకరించిన డిగ్రీ ప్రొవిజనల్, ఆధార్ ఓటర్ ఐడీలతోపాటు ఫొటోను పైన పేర్కొన్న వెబ్‌సైట్ ద్వారా అప్‌లోడ్ చేస్తే సరిపోతుంది.

కూరగాయల మార్కెట్‌కు కాకా వెంకటస్వామి పేరు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాంటా చౌరస్తా వద్ద నిర్మించిన కూరగాయల మార్కెట్ భవనానికి స్వర్గీయ కాకా వెంకటస్వామి పేరు పెట్టడానికి మున్సిపల్ సమావేశంలో ఆదివారం తీర్మానించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ జక్కుల శ్వేత ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ కుమార్ దీపక్, ఎమ్మెల్యే గడ్డం వినోద్‌లు హాజరయ్యారు. సమావేశంలో కొమ్ము సురేష్ కూరగాయల మార్కెట్ భవనానికి స్వర్గీయ వెంకటస్వామి పేరును ప్రతిపాదించగా 20 మంది కౌన్సిలర్లు ఆమోదం తెలిపారు. దీంతో భవనానికి వెంకటస్వామి పేరు పెడుతున్నట్లు ఛైర్‌పర్సన్ ప్రకటించారు. పలువురు కౌన్సిలర్లు సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ సమస్యలున్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా ప్రత్యేక నిధులు కేటాయిస్తామని తెలిపారు. కౌన్సిలర్ దామెర శ్రీనివాస్ మాట్లాడుతూ ఇందిరమ్మ కమిటీల్లో కౌన్సిలర్‌లకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఎమ్మెల్యే, కలెక్టర్‌లు మాట్లాడుతూ పట్టణంలోని పలు వార్డుల అభివృద్ధికి ప్రత్యేక నిధులను కేటాయించి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. నెన్నెల మండలానికి చెందిన పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఆర్డీవో హరికృష్ణ, కమిషనర్ శ్రీనివాస్‌రావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సీపీఐ శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

తాండూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సీపీఐ శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ పేర్కొన్నారు. ఆదివారం మండల కౌన్సిల్ సమావేశంలో మాట్లాడారు. ఉత్సవాలను గ్రామగ్రామాన ఘనంగా నిర్వహించాలన్నారు. వంద సంవత్సరాల చరిత్ర కలిగిన పార్టీ దేశంలో కమ్యూనిస్టు పార్టీ ఒక్కటేనని తెలిపారు. పేదల ప్రజల కోసం ఎన్నో పోరాటాలు చేసిందని సీపీఐ మాత్రమేనని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ సత్తా చాటాలన్నారు. అనంతరం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా సాలిగామ సంతోష్, సహాయ కార్యదర్శులుగా మలిశెట్టి సత్యనారాయణ,నరాల ప్రహ్లాద్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వాసాల సాగర్, కోశాధికారిగా పట్టి శంకర్, 21 మంది కౌన్సిల్ సభ్యులను, 11 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. బయ్య మొగిలి, మాజీ ఎంపీపీ కామెర మల్లయ్య, జిల్లా సమితి సభ్యులు బానేష్, లక్ష్మీనారాయణ, రాజమౌళి పాల్గొన్నారు



నెన్నెలలో సాగు చేస్తున్న డ్రాగన్ తోట

లాభాల డ్రాగన్



మార్కెట్‌కు తరలించేందుకు కోసిన పండ్లు

- నాటిన ఏడాదికే చేతికొస్తున్న దిగుబడి
- ఉద్యాన పంటపై రైతుల ఆసక్తి
- సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం
- జిల్లా నేలలు అనుకూలం.. పెరుగుతున్న సాగు విస్తీర్ణం

బెల్లంపల్లి/నెన్నెల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతులు నూతన పంటల సాగువైపు మొగ్గు చూపు తున్నారు. విదేశీ పంటైన డ్రాగన్ ఫ్రూట్ సాగు చేసి లాభాలు ఆర్జిస్తున్నారు. జిల్లాలోని నెన్నెల, కన్నెపల్లి, బుయ్యారం, బెల్లంపల్లి, కన్నాల, చాకెపల్లి, గురిజాల, బూదకలాన్, లింగన్నపేట, కొల్లూరు, పిన్నారం, పారుపల్లి తదితర గ్రామాల్లో వంద ఎకరాల్లో డ్రాగన్ పంట సాగవుతోంది. మార్కెట్లో డిమాండ్ ఉండటంతో ఈ పంటపై రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. ప్రభుత్వం రాయితీలు అందజేసి ప్రోత్సహిస్తుండటంతో సాగు విస్తీర్ణం పెరుగుతోంది.

● జిల్లా నేలలు అనుకూలం

సమశీతోష్ణ పంటైన డ్రాగన్‌కు జిల్లాలోని అన్ని రకాల నేలలు అనుకూలంగా ఉన్నాయి. ఈ మొక్కలను ఒకసారి నాటితే 30 ఏళ్ల వరకు దిగుబడులు ఇస్తాయి. మొక్క ధర రూ.50 నుంచి రూ.70 వరకు ఉంటుంది. 7ఫీట్ల సిమెంటు దిమ్మె చుట్టు నాలుగు మొక్కలు నాటవచ్చు. హెక్టారుకు 3వేల మొక్కలు నాటవచ్చు. ఏడాదిలో మూడుసార్లు కాపు వస్తుంది. ఇతర పంటలతో పోల్చుకుంటే చీడపీడల బెడద, ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుంటుంది. సేంద్రియ ఎరువులు వాడితే పంట దిగుబడి అధికంగా వస్తుంది. హెక్టారు విస్తీర్ణంలో తోట పెంపకానికి రూ.4 లక్షల వరకు ఖర్చు అవుతుంది. డ్రిప్ ఏర్పాటు చేసుకొని నాలుగు రోజులకోసారి నీరు పెడితే సరిపోతుంది. డ్రాగన్ ఫ్రూట్ మొగ్గగా మారినప్పటి నుంచి పండుగా మారాలంటే 45 రోజుల సమయం పడుతుంది. ఆ తర్వాత రోజుకు కొన్ని చొప్పున కోసి మార్కెట్‌కు తరలించవచ్చు.



డ్రాగన్‌చెట్టుకు వచ్చిన డ్రాగన్ ఫ్రూట్స్

● ఆదాయం ఇలా....

డ్రాగన్ ఫ్రూట్‌కు హోల్‌సేల్‌గా కిలో రూ. 150 నుంచి రూ. 180 వరకు పలుకుతోంది. రైతులు నేరుగా మార్కెట్‌కు తరలిస్తే కేజీ రూ.200 వరకు కూడా అమ్ముకోవచ్చు. దాదాపు రెండు నెలల వరకు పాడు కాకుండా ఉండటం ఈ పండు ప్రత్యేకత. డ్రాగన్ పండుతో చిప్స్, వడియాలు, కుకీస్, చాక్లెట్లు, డ్రైపౌడర్ లాంటి పదార్థాల తోపాటు సౌందర్య సాధనాలైన సబ్బులు, ఫేస్ ప్యాక్‌లు, లిప్‌బామ్ లాంటివి తయారు చేసి విక్రయించుకునేలా రైతులను చైతన్య పరుస్తున్నారు. పంట వేసిన మూడు ఏళ్లు పెట్టుబడి పెట్టాల్సి వస్తుంది. యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఎకరానికి ఏడాదిలో పది టన్నుల దిగబడి సాధించవచ్చు.

● రాయితీలతో ప్రోత్సాహం

డ్రాగన్ తోటల పెంపకానికి ప్రభుత్వం సన్న, చిన్నకారు రైతులకు రాయితీలు ఇచ్చి ప్రోత్సహిస్తోంది. ఉద్యానశాఖ ద్వారా హెక్టారుకు రూ.1.60 లక్షలు సబ్సిడీ ఇస్తున్నారు. దశల వారీగా మూడేళ్లపాటు సబ్సిడీ అందజేస్తారు. అర్హులైన రైతులకు ప్లాంట్ మెటీరియల్‌గా రూ.24వేలు, సిమెంటు పోళ్లు, రింగులకు రూ.52,900లు, డ్రిప్ ఇరిగేషన్ కోసం రూ.19,100 మొదటి సంవత్సరంలోనే అందజేస్తారు. వివిధ పరికరాల కొనుగోలు, ఎరువుల యాజమాన్యానికి రెండు, మూడో సంవత్సరం రూ. 32 వేల చొప్పున ఇస్తారు.

దిగుబడి బాగుంది



బెల్లంపల్లి మండలంలోని లంబడితండా గ్రామంలో చొప్పదండి స్వామి దివ్య దంపతులు నాలుగేండ్లుగా డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తున్నారు. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే ఈ పండును ఇక్కడ పండించాలనే ఆలోచన వారిలో తలెత్తింది. పంటను సాగు చేసేందుకు ఇంటర్‌నెట్‌లో పలు మెళకువలను తెలుసుకున్నా. రెండు ఎకరాల్లో సూర్యపేట నుంచి డ్రాగన్ ఫ్రూట్ మొక్క ఒక్కొక్కటి రూ.50తో కొనుగోలు చేశాడు. రెండెకరాల్లో దాదాపు వెయ్యికి పైగా సిమెంట్ పోల్స్‌ను ఏర్పాటు చేసుకొని సాగు చేస్తున్నాడు. అంతర్‌పంటగా జామ, ఖర్జూర పంటలను సాగు చేస్తున్నాడు. రెండెకరాల స్థలంలో దాదాపు వందకు పైగా కొబ్బరి చెట్లను నాటాను.

- చొప్పదండి స్వామి

న్యూస్ బాక్స్

బీజేపీ, కాంగ్రెస్ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతాం



ఓంకార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

బెల్లంపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పేరుతో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, సెక్యులర్ ముసుగులో ఉన్న కాంగ్రెస్ విధానాలకు వ్యతిరేకంగా ఎంసీపీఐయూ పార్టీ పోరాడుతుందని జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆదివారం పట్టణంలో ఎంసీపీఐయూ వ్యవస్థాపకులు, రైతాంగం సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ వర్ధంతి సభను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుతో నిరుద్యోగం పెరిగిపోతుందని, ఎంతో మంది ఆకలితో అలమటిస్తున్నారన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్, పట్టణ కార్యదర్శి రమేష్, మండల కార్యదర్శి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధులపై అవగాహన కల్పించాలి

మందమర్రిరూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కిడ్నీ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని వెంకటాపూర్ గ్రామానికి చెందిన సామాజిక వేత్త వంజరి వెంకటేష్ ఆదివారం లయన్స్‌క్లబ్ కోఆర్డినేటర్ పూదరి చంద్రమోహన్‌గౌడ్‌కు వినతి పత్రం అందించారు. వెంకటేష్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రోజు రోజుకు డయాలసిస్ బాధితులు పెరిగి పోతున్నారని, కిడ్నీ వ్యాధుల పట్ల సరైన అవగాహన లేకపోవడంతో డయాలసిస్ బారిన పడుతున్నారని తెలిపారు. కిడ్నీ వ్యాధులపై అవగాహన సదస్సులు నిర్వహించాలని కోరారు. మురళీ, రమేష్ పాల్గొన్నారు.

పరిశ్రమలకు మంచి రోజులు

మందమర్రి టౌన్, అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సంప్రదింపుల కమిటీ సభ్యుడిగా పెద్దపల్లి ఎంపీ నియమితులు కావడం గొప్ప విషయమని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఉపేందర్‌గౌడ్, సొత్కు సుదర్శన్‌లు పేర్కొన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎంపీ వంశీకృష్ణ పరిశ్రమలను పరిరక్షిస్తారని వారు తెలిపారు. నాయకులు పుల్లూరి లక్ష్మణ్, భాస్కర్, శ్రీనివాస్, రమేష్, గడ్డం రజిని, రంజిత్‌గౌడ్, పాల్గొన్నారు.

గంగపుత్రుల సమస్యల పరిష్కారానికి కృషి

బెల్లంపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : గంగపుత్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని గంగపుత్ర సంఘం అధ్యక్షుడు చక్రపాణి అన్నారు. ఆదివారం పట్టణంలో గంగపుత్ర సంఘం కమిటీని ఎన్నుకుని మాట్లాడారు. ప్రభుత్వం గంగపుత్రుల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు. అనంతరం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం కార్యదర్శులుగా మల్లేష్, దామెర విజయ్‌కుమార్‌లను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు కమిటీ ఛైర్మన్‌గా సదానందం, జిల్లా ఉపాధ్యక్షుడు డోలి సుధాకర్, చీఫ్ అడ్వైజర్‌గా పోతరాజు వ్యవహరించారు.

ఘనంగా గజ్జె పూజ మహోత్సవం...

● కూచిపూడి నృత్య ప్రదర్శన



గజ్జె పూజలో పాల్గొన్న విద్యార్థులు



కూచిపూడి నృత్య ప్రదర్శన

నస్పూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ కాలనీలోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో ఆదివారం శార్వాణి కూచిపూడి నృత్యాలయం విద్యార్థులకు గురువు డాక్టర్ భార్గవిప్రేమ్ ఆధ్వర్యంలో గజ్జె పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. కూచిపూడి నృత్యంలో శిక్షణ పొందుతున్న 20 మంది విద్యార్థులకు వేద పండితుల సమక్షంలో వైభవంగా పూజ నిర్వహించారు. అనంతరం 40 మంది విద్యార్థులచే కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. సాంప్రదాయ వేషధారణలో చిన్నారులు చేసిన నృత్యం చూపరులను ఆకట్టుకొంది. డాక్టర్ భార్గవిప్రేమ్ మాట్లాడుతూ భారతీయ సాంప్రదాయ కళ కూచి పూడి నృత్యంలో ఎక్కువ మంది విద్యార్థులు శిక్షణను ఇవ్వడమే లక్ష్యమన్నారు. జిల్లా నృత్య సంఘం అధ్య క్షుడు రాకం సంతోష్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు

- భీమిని మండలంలో 21 కేంద్రాలు
- మూడింటికి పక్కా భవనాలు
- మిగతా అద్దె ఇండ్లలో, పాఠశాలల్లో నిర్వహణ



భీమినిలో అద్దె భవనంలో ఇరుకు గదిలో కొనసాగుతున్న అంగన్‌వాడీ భవనం

భీమిని, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): చిన్నారులు, బాలింతలు గర్భిణులకు పౌష్టికాహారం తోపాటు ఆహ్లాద వాతావరణం కల్పించాల్సిన అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాలు, ఇరుకు గదుల్లో నిర్వహిస్తున్నారు. టీచర్లు, ఆయాలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 12 గ్రామ పంచాయతీల్లో 21 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 1027 మంది చిన్నారులు, 93మంది గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారం పొందు తున్నారు. వీటిలో మల్లిడి, కేస్లాపూర్, ఖర్జీభీం పూర్ గ్రామాల్లో మాత్రమే పక్కా భవనాలు ఉన్నాయి. 18 కేంద్రాలలో 8 అద్దెభవనాల్లో, మిగతావి 10 ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహి స్తున్నారు. మండల కేంద్రంతో పాటు, పలు గ్రామాల్లో శిథిల భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు సంభవిస్తా యోనని భయాం దోళన చెందుతున్నారు. వడాల, వెంకటాపూర్, వీగాం గ్రామాల్లో టీచర్ పోస్టులు, మండలంలో ఆరు ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ఆటలు, పాటలకు దూరంగా చిన్నారులు

చిన్నారులకు ఆటాపాటలతో పాటూ విద్యను అందించడమే అంగన్‌వాడీ కేంద్రాల ప్రధాన లక్ష్యం. సొంత భవనాలు ఆట స్థలం లేక ఒకే గదిలో నిర్వహిస్తున్నారు. ఫలితంగా ప్రైవేట్ పాఠశాలల వైపు వెళ్తున్నారు. దీంతో అనుకున్న స్థాయిలో చిన్నారులు చేరని పరిస్థితి నెలకొంది. మండలంలో అంగన్‌వాడీ భవనాల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు అందించినట్లు సూపర్‌వైజర్ రమాదేవి తెలిపారు.

నిర్వహణ కష్టంగా ఉంది...



పాతకాలం నాటి ఇరుకు గదిలో అంగన్ వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నాం. కాలనీకి చెందిన చిన్నారులు, గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకుంటున్నారు. పక్కా భవ నం లేకపోవడంతో నిర్వహణ కష్టంగా మారింది. అధికారులు స్పందించి పక్కా భవనం నిర్మించాలి.

- సులోచన, అంగన్‌వాడీ టీచర్ భీమిని

నేడు నూతన విద్యా విధానంపై సదస్సు

మందమర్రిటౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీకన్వెన్షన్ హాలులో సోమవారం నూతన విధానంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు ట్రస్మా రాష్ట్ర నాయకులు అబ్దుల్ అజీజ్ తెలిపారు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మందమర్రి, బెల్లంపల్లి సభ్యుల నేతృత్వంలో ఈ సదస్సు జరుగుతుందని తెలిపారు. సదస్సులో విద్యావిధానంపై చర్చ ఉంటుందని, ట్రస్మా భవిష్యత్ కార్యాచరణను చర్చించడం జరుగుతుందన్నారు. ఈ సదస్సుకు అతిథిగా అల్ఫోర్స్ విద్యాసంస్థల ఛైర్మన్ నరేందర్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. సదస్సుకు ఏర్పాట్లు కూడా పూర్తి చేసినట్లు తెలిపారు.

విద్యుత్ దీపాలు అమర్చారు... కనెక్షన్ ఇవ్వడం మరిచారు...

మంచిర్యాల అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముఖరాం చౌరస్తా సమీపంలో గల అండర్ బ్రిడ్జి డివైడర్ మధ్యలో విద్యుత్ స్తంభాలతోపాటు దీపాలను అమర్చిన అధికారులు కనెక్షన్ ఇవ్వడం మరిచారు. బ్రిడ్జి ప్రారంభం నుంచి దీపాలను అమర్చకపోవడంతో ప్రజలు చీకట్లోనే ప్రయాణిస్తున్నారు. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి సుమారు నెల రోజులు గడుస్తున్నా కనెక్షన్ ఇవ్వడంలో జాప్యం కారణంగా అంధకారంలోనే ప్రయాణాలు సాగించాల్సి వస్తోంది. అధికారులు స్పందించి విద్యుత్ దీపాలకు కనెక్షన్ ఇస్తారో... లేదో... చూడాల్సివుంది.

శ్మశానవాటికను కబ్జా చేస్తే సహించేది లేదు



మాట్లాడుతున్న శ్మశానవాటిక పరిరక్షణ కమిటీ సభ్యులు

మందమర్రి టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేకే ఓసీ పక్కన గల శ్మశాన వాటికను పవన్‌రావు అనే వ్యక్తి కబ్జా చేస్తున్నాడని 8వ వార్డు శ్మశానవాటిక పరిరక్షణ కమిటీ సభ్యులు వనం నర్సయ్య, బోరిగం వెంకటేష్, రాచర్ల రవికుమార్ తెలిపారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 60 సంవత్సరాలుగా అక్కడే దహన సంస్కారాలు చేస్తున్నామని తెలిపారు. ఇటీవల పుస్కూరి పవన్‌రావు ఈ స్థలం తనదంటూ భూమిని చదును చేశాడని, సమాధులను కూలగొట్టాడని, చనిపోయిన వారి ఆనవాళ్లు లేకుండా చేశారని మండిపడ్డారు. గతంలో అడ్డుకున్నామని, మళ్లీ ప్లాట్లుగా మార్చేందుకు కుట్రలు చేస్తున్నాడని, ఆరు దశాబ్దాలుగా లేని వారు ఇప్పుడు వచ్చి స్థలాలు తమయని పేర్కొనడంపై మండిపడ్డారు. ఇటీవల బురదగూడెంతోపాటు పాలచెట్టు ఏరియాలోని ఐటీఐ సమీపంలో సమాధులను తొలగించి భూమిని చదును చేశారన్నారు. నాయకులు బండి శంకర్ గౌడ్, రాచర్ల గనేష్, సత్యం, కె తిరుపతి పాల్గొన్నారు.

శ్రమదానం చేసిన వాకర్స్



గుంతలను మట్టితో నింపుతున్న వాకర్స్

శ్రీరాంపూర్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : ప్రగతి స్టేడియంలో వాకర్స్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రమదానం చేశారు. పలువురు మాట్లాడుతూ, ప్రగతి స్టేడియంలో వాకర్స్ ట్రాక్ వర్షంతో నడవడానికి వీలు లేకుండా కోతకు గురైందని తెలిపారు. పిచ్చిమొక్కలు పెరిగి నడవడానికి ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. పశువులు స్టేడియంలో తిరుగుతూ ఇబ్బంది కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి అధికారులకు తెలిపినా వారు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాకింగ్ ట్రాక్ బాగు చేయాలని వారు కోరారు.



న్యూస్ బాక్స్

దరఖాస్తుల ఆహ్వానం

కోటపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : కోటపల్లి మోడల్ స్కూల్, కళాశాలలో ఖాళీగా ఉన్న ఇంగ్లిష్(పీజీటీ) పోస్టుకు అర్హులైన అభ్యర్థులు ఈనెల 29లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. గంటల ప్రతిపాదికన బోధించడానికి సంబంధిత సబ్జెక్టులో ఎంఏ, బీఈడీ అర్హతలు గల అభ్యర్థులు సంబంధిత ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ ప్రతులతో పాఠశాలలో అందజేయాలన్నారు.

సస్పెన్షన్ ఎత్తివేయాలి

హాజీపూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గుడిపేట 13వ బెటాలియన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్స్‌పై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని కమాండెంట్ రాములుకు ఆదివారం కానిస్టేబుళ్ల వినతిపత్రాలు అందించారు. రెండు రోజులుగా బెటాలియన్ పోలీసు కానిస్టేబుళ్ల భార్యలు ధర్నా చేశారు. డీజీపీ ఆదేశాల మేరకు 13వ బెటాలియన్‌లో పనిచేస్తున్న నలుగురు కానిస్టేబుళ్లు, ఒక హెడ్ కానిస్టేబుల్‌ను శనివారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆదివారం కమాండెంట్ రాములును కలిసి సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరారు. కమాండెంట్ మాట్లాడుతూ ఉన్నతాధికారులకు తెలిపి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు.

సదర్ ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే



మందమర్రిటౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): హైద్రాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో ఆదివారం రాజ్యసభ సభ్యులు అనిల్‌యాదవ్, అంజన్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ ఉత్సవాల్లో చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి హాజరయ్యారు. వారితో కలిసి ఎమ్మెల్యే నృత్యాలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ యాదవులు నిర్వహిస్తున్న వేడుకలు వారి సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయన్నారు.

ఒక డీఏ ప్రకటించడం విచారకరం

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి): ఐదు డీఏలు పెండింగ్‌లో ఉండగా రాష్ట్ర ప్రభుత్వం ఒక డీఏను విడుదల చేయడం విచారకరమని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుండారపు చక్రపాణి, గుర్రాల రాజవేణు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన 15 రోజుల్లో మూడు డీఏలను విడుదల చేస్తామని మెనిఫెస్టోలో పేర్కొన్నారని, రాష్ట్ర పరిస్థితి అర్థం చేసుకొని 10 నెలలుగా ఓపిక పట్టామని తెలిపారు. కనీసం రెండు డీఏలనైనా ప్రకటిస్తారని భావించామని, ఒక డీఏను ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు.

మిగిలింది పది రోజులే..!



- సమీపిస్తున్న ఓటరు నమోదు గడువు
- పట్టభద్రుల నుంచి కానరాని స్పందన
- స్వయంగా రంగంలోకి దిగిన ఆశావహులు
- సర్టిఫికేట్లు, ఇతర ఆధారాలతో ప్రక్రియ పూర్తి
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో తారాస్థాయికి చేరిన ప్రచారం

మంచిర్యాల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. రాష్ట్ర ఎన్నికల సంఘం రెండు ఎమ్మెల్సీల ఎన్నికలకు సంబంధించి కార్యాచరణ మొదలు పెట్టడంతో వివిధ పార్టీల నుంచి టికెట్ ఆశావహులు ప్రచారం ముమ్మరం చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల పరిధిలో ఈ ఎన్నికలు వేర్వేరుగా జరగనున్నాయి. రెండు వర్గాల ఎమ్మెల్సీ ఎన్నికలు ఈసారి ఆసక్తికరంగా మారనున్నాయి. ఉమ్మడి నాలుగు జిల్లాల్లోని 42 అసెంబ్లీ నియోజకవర్గాలలో ప్రస్తుతం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా కాంగ్రెస్ పార్టీకి చెందిన జీవన్‌రెడ్డి కొనసాగుతుండగా, టీచర్ ఎమ్మెల్సీగా పీఆర్‌టీయూకు చెందిన రఘోత్తం రెడ్డిలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరి పదవీ కాలం ఫిబ్రవరిలో ముగియనుంది. ఈ నేపథ్యంలో గత నెల 30 నుంచి నవంబరు 6వ తేదీ వరకు ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. ఈసారి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సుమారు 300 మండలాలకు చెందిన ఎనిమిది లక్షల మంది వరకు ఓటర్లు ఉంటారని అంచనా. గతంతో పోల్చితే పట్టభద్రుల సంఖ్య అధికంగా ఉండటం, వారి వివరాల సేకరణకు నాలుగు ఉమ్మడి జిల్లాలు తిరగాల్సి రావడంతో ముందస్తుగా ఆశావహులు ఓటరు నమోదు ప్రక్రియలో నిమగ్నమయ్యారు.

ఊపందుకున్న ప్రచారం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా పట్టభద్రులు, ఉపాధ్యాయ మండలి ఎన్నికల ప్రచార సందడి రోజురోజుకు పెరుగుతోంది. టికెట్ ఆశిస్తున్న అభ్యర్థులు క్షేత్రస్థాయిలో ప్రచారం ముమ్మరం చేశారు. పట్టభద్రులను, ఉపాధ్యాయులను కలుస్తూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచిస్తున్నారు. కానీ ఓటరు నమోదు ప్రక్రియ మాత్రం నత్తనడకన సాగుతోంది. దరఖాస్తుల స్వీకరణకు నవంబరు 6వ తేదీ వరకు గడువు ఉండడం తో 10 రోజులే మిగిలి ఉంది. ఉపాధ్యాయ సంఘాల నుంచి పోటీ నెలకొనడంతో టీచర్లకు ఓటరు నమోదు తప్పనిసరి అయింది. అయితే పట్టభద్రుల నుంచి మాత్రం స్పందన అంతంతే ఉంది.

ఓటరు నమోదుకు స్పందన కరువు

జిల్లాల్లోని అన్ని తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల్లో ఓటరు నమోదు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రత్యేక అధికారిని నియమించి దరఖాస్తులను అందుబాటులో ఉంచారు. అయినా ఆదరణ అంతంతా మాత్రంగానే ఉంటోంది. దీపావళి పండగ అనంతరం నమోదు ప్రక్రియ వేగం పుంజుకునే అవకాశం ఉన్నట్లు అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఉపాధ్యాయ, అధ్యాపక వృత్తిలో ఉన్నవారు కూడా ఓటరు నమోదుకు అంతగా స్పందించకపోవడం విశేషం. ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు పాఠశాలలకు వెళ్లి నమోదు పత్రాలు అందజేసినా పరిస్థితిలో మార్పు కనిపించడం లేదు. మండలి ఎన్నికల్లో ఓటు వేయాలంటే కొత్తగా అర్హులందరూ...

మిగతా 5వ పేజీలో...

లక్ష్యం..నిర్లక్ష్యం..!

- తడి పొడి చెత్తపై కొరవడిన అవగాహన
- నిర్మించి వదిలేశారు..
- పట్టించుకోని అధికారులు

4

లాభాల డ్రాగన్

- నాటిన ఏడాదికే చేతికొస్తున్న దిగుబడి
- ఉద్యాన పంటపై రైతుల ఆసక్తి
- సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం
- జిల్లా నేలలు అనుకూలం.. పెరుగుతున్న సాగు విస్తీర్ణం

5



డ్రాగన్ ఫ్రూట్ సాగు

అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు

- మూడింటికి పక్కా భవనాలు
- మిగతా అద్దె ఇండ్లలో, పాఠశాలల్లో నిర్వహణ

5

గ్రామీణాభివృద్ధికి పెద్దపీట : ఎమ్మెల్యే వినోద్

నెన్నెల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తున్నట్లు ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. కేటాయింపుల్లో రోడ్డు, రవాణా, విద్య, వైద్యంతోపాటు వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. మన్నెగూడం క్రాస్‌రోడ్ నుంచి కోనంపేట మీదుగా కుశ్నపల్లి వరకు బీటీ రోడ్డు, మన్నెగూడం ప్రాథమిక పాఠశాల ప్రహరి నిర్మాణ పనులను ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్టు చెప్పారు. రోడ్డు నిర్మాణంతో మన్నెగూడం, కోనంపేట, పాటి గ్రామస్థుల రవాణా కష్టాలు తీరుతాయన్నారు. రోడ్డు పనులు సత్వరం పూర్తి చేయాలని ఆదేశించారు. పార్టీ మండల అధ్యక్షుడు గట్టు మల్లేష్, నాయకులు బొమ్మెన హరీష్‌గౌడ్, తోట శ్రీనివాస్, కిషన్‌రెడ్డి, గట్టు బానేష్, బాపురెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సంధ్య, శిరీష తదితరులు పాల్గొన్నారు.

తాండూర్(ఆంధ్రజ్యోతి): గ్రామాలు అభివృద్ధి చెందాలంటే రవాణా మార్గం మెరుగ్గా ఉండాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. బోయపల్లి నుంచి గుండు గూడెం మీదుగా బుగ్గ రాజరాజేశ్వర దేవాలయం వరకు రూ.2.40 కోట్లతో రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో అంతర్గత రహదారులు చేపడతామన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బోయపల్లి మాజీ సర్పంచు సుందిళ్ల భూమయ్యను పరామర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు ఎండీ ఈసా, మాజీ ఎంపీటీసీలు సూరం రవీందర్ రెడ్డి, సిరంగి శంకర్, మాజీ జెడ్పీటీసీ బండి పోచం, మాజీ ఎంపీపీ మాసాడి శ్రీదేవి పాల్గొన్నారు.



నెన్నెల మండలం కోనంపేట రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గడ్డం వినోద్

నేడు కాకో ఆలయంలో గుస్సాడీ దర్బార్





ముస్తాబైన పద్మల్ పూరీ కాకో అమ్మవారు, గుస్సాడీ నృత్యాలు చేస్తున్న గిరిజనులు

దండేపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పద్మల్ పూరీ కాకో ఏత్మాసార్ ఆలయంలో సోమవారం మధ్యాహ్నం గుస్సాడీ దర్బార్ జరగనుంది. ఆలయకమిటీ చైర్మన్ కుడిమేత సోము, గోండ్వానా రాయిసెంటర్ మండల అధ్యక్షుడు పెంద్రం శ్రీనివాస్‌లు మాట్లాడుతూ ఆదివాసి సంస్కృతీ సంప్రదాయాల్లో భాగంగా నిర్వహించే గుస్సాడీ దర్బార్‌కు మంత్రులు, ఎమ్మెల్యే, ఎంపీలతోపాటు, ఉన్నతాధికారులు హాజరుకానున్నారు. గుస్సాడీ దర్బార్‌కు కాకో ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఉమ్మడి జిల్లాల నుంచి గిరిజనులు కుటుంబసభ్యులతో గుస్సాడీ దర్బార్‌కు హాజరుకానున్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఆలయం వద్ద సౌకర్యాలతోపాటు అన్నదానం ఏర్పాటు చేయనున్నారు.

తరలివస్తున్న గిరిజనులు

గుడిరేవులోని పద్మల్‌పూరీకాకో ఆలయానికి గిరిజనులు తరలివస్తున్నారు. దీపావళి పండుగతో దండారీ ఉత్సవాలు ముగుస్తుండటంతో ఆదివారం పెద్దఎత్తున గిరిజనులు కుటుంబసమేతంగా ఆలయానికి చేరుకున్నారు. ముందుగా గుస్సాడి వేషధారణలతో డప్పుచప్పులతో నృత్యాల మధ్య గోదావరి తీరానికి చేరుకుని స్నానం ఆచరించి అనంతరం గంగాజలంతో అభిషేకం చేశారు. గిరిజన మహిళలు ప్రత్యేక పిండి పదార్థాలు వండి కాకోఅమ్మ వారికి సమర్పించారు. పూజల అనంతరం ఆలయ ప్రాంగణంలో గుస్సాడి వేషధారణలు, కోలాటాలతో సందడి చేశారు.

ఆదివాసీల అభివృద్ధికి ప్రత్యేక నిధులు



గుస్సాడీ టోపీతో ఎమ్మెల్యే వినోద్

కాసిపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే గడ్డం వినోద్‌వెంకటస్వామి అన్నారు. ఆదివారం సల్పలవాగు సమీపంలోని వెంకటాద్రి ఆలయంలో నిర్వహించిన దండారీ దర్బార్‌కు అతిథిగా హాజరై మాట్లాడారు. ఆదివాసీలు అధికంగా ఉన్న మండలాన్ని దత్తత తీసుకుని గిరిజన గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఆలయానికి ప్రహరీ నిర్మించి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతానన్నారు. ఆదివాసీల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎమ్మెల్యేను సంప్రదాయ వాయిద్యాలతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే నెమలి ఈకల కిరీటాన్నిధరించి నృత్యం చేసి దండారి గిరిజన కళాకారుల్లో ఉత్సాహం నింపారు.

సంప్రదాయాలను కాపాడేందుకు దండారీ ఉత్సవాలు

అంతరించిపోతున్న ఆదివాసీ గోండుల సంస్కృతి, సంప్రదాయాలను ముందు తరాలకు అందించేందుకు దండారీ దర్బార్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కమిటీ అధ్యక్షుడు ఆడె జంగు అన్నారు. వెంకటాద్రి ఆలయాన్ని అభివృద్ధి చేయాలన్నారు. గుస్సాడీ నృత్యాలు, మహిళల సంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఓరియంట్ సిమెంట్ కంపెనీ అన్నదాన కార్యక్రమం నిర్వహించింది. కంపెనీ అధికారులు బాల గిరిధర్, ఆనంద్ కులకర్ణి, నిర్వహణ కమిటీ నాయకులు పెంద్రం హన్మంతు, వెడ్మ కిషన్, మడావి వెంకటేష్, ఆత్రం జంగు, సిడాం రాందాస్ పాల్గొన్నారు.

పేరుకే 24 గంటల ఆసుపత్రి

తలుపు తెరువని సిబ్బంది

భీమిని, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): భీమిని మండల కేంద్రంలోని 24 గంటల ఆసుపత్రి అది. బిట్టూరుపల్లి గ్రామానికి చెందిన మథెన మల్లేశ్వరి తీవ్ర కడుపు నొప్పితో ఆదివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఆమె భర్త నరేష్‌తో కలిసి ఆటోలో ఆరోగ్య కేంద్రానికి వెళ్లారు. ఎంత పిలిచినా ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది తలుపులు తెరువలేదు... దీంతో ఏమీ చేయలేని పరిస్థితుల్లో ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నారు. సిబ్బంది తలుపులు తెరువక పోవడంతో బాధితులు సెల్ఫీ వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. సిబ్బంది తలుపు కూడా తెరవకపోవడంతో ప్రజల్లో విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఎల్లంపల్లి ప్రాజెక్టులో చేప పిల్లలు విడుదల

హాజీపూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఆదివారం అదనపు కలెక్టర్ మోతిలాల్, కాంగ్రెస్ నాయకులు చేప పిల్లలను వదిలారు. లక్ష చేప పిల్లలను ప్రాజెక్టు నీటిలోకి విడిచి పెట్టారు. మత్స్యసంపదను పెంచడంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. మత్స్యశాఖ ఏడీ భాస్కర్, కాంగ్రెస్ నాయకులు తోట రవి, డేగ బాపు, బాలరాజు,సురేందర్, తూముల నరేష్, సత్యనారాయణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



చేప పిల్లలను వదులుతున్న అదనపు కలెక్టర్, కాంగ్రెస్ నాయకులు

వినియోగదారులకు ఇబ్బంది లేకుండా చూడడమే లక్ష్యం



బాధితుడి నుంచి వివరాలు సేకరిస్తున్న ట్రాన్స్‌కో ఎస్‌ఈ

చెన్నూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని ట్రాన్స్‌కో ఎస్‌ఈ శ్రావణ్‌కుమార్ అన్నారు. కొమ్మెర, ఆస్నాద గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించి వినియోగదారులను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. గ్రామాల్లో విద్యుత్ అధికారులు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి విద్యుత్ సమస్యలను పరిష్కరించాలన్నారు. కొమ్మెరలో గట్టు సంపత్‌గౌడ్‌కు వచ్చిన బిల్లును పరిశీలించి న్యాయం చేసేలా కృషి చేస్తామన్నారు. గ్రామస్థులు బాప గౌడ్, స్వామి, నర్సింహాచారి, లైన్‌మెన్‌లు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్

చెన్నూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు మున్సిపల్ కమిషనర్‌గా ఎస్. మురళీకృష్ణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన కమిషనర్ గంగాధర్ సీడీఎంఏకు బదిలీ కాగా ఆయన స్థానంలో క్యాతనపల్లి మున్సిపాలిటీ కమిషనర్‌గా మురళీకృష్ణ నియమితులయ్యారు.

నూతన ఉపాధ్యాయులకు అవగాహన

మంచిర్యాల అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నూతనంగా నియమితులైన ఉపాధ్యాయులకు డీటీఎఫ్ జిల్లా శాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆసంపల్లి రమేష్, మోతె జయకృష్ణల ఆధ్వర్యంలో బాలుర ఉన్నత పాఠశాలలో అవగాహన కల్పించారు. రాష్ట్ర కార్యదర్శి ఎం.శామ్యూల్ ముఖ్య అతిథిగా హాజరై వృత్తి నిబద్ధత సామాజిక బాధ్యత అనే అంశంపై మాట్లాడారు. మూతపడుతున్న బడులు, తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకాన్ని పెంచడం, సమయపాలన పాటించడం, విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించాలని సూచించారు. జిల్లా కార్యదర్శి జాకీర్‌హుస్సేన్, పూర్వ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొండయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు కుమార్‌లు లీవ్ రూల్స్, డేటా ఎంట్రీ, మార్క్స్ ఎంట్రీ, ఫేషియల్ అటెండెన్స్‌పై అవగాహన కల్పించారు.



ఆన్‌లైన్ ఎంట్రీపై అవగాహన కల్పిస్తున్న కుమార్

అడవుల సంరక్షణకు కృషి చేయాలి

దండేపల్లి/జన్నారం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అడవుల సంరక్షణకు కృషి చేయాలని కవ్వాల్ టైగర్ రిజర్వ్ సీఎఫ్, ఎఫ్‌డీపీటీ శాంతారామ్ అన్నారు. తాని మడుగు బీట్ పరిధిలో జరుగుతున్న టేకు చెట్ల నరికివేతను జిల్లా అటవీ శాఖ అధికారి శివ్ ఆశిశ్‌సింగ్, తాళ్లపేట ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సుష్మారావు, ఇందన్‌పల్లి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్, జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ ఆఫీసర్ రమాదేవి కలిసి ఆదివారం పరిశీలించారు. అడవులను రక్షించడంలో అటవీశాఖ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. అడవుల సంరక్షణతో పాటు చిన్నారుల్లో వన్యప్రాణులపై అవగాహన పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యార్థులకు సీతాకోక చిలుకల సర్వే, పక్షుల సర్వే నిర్వహించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నామని వివరించారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు